క్లుప్తంగా

రక్త దాతలకు సన్మానం



రక్తదాతలను సన్మానిస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్: జాతీయ స్వచ్ఛంద **రక్తదాతల** దినోత్సవం సందర్భంగా స్థానిక **రమణయ్యపేటలో** అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో **రక్త** దాతలు కృష్ణమోహన్, చింతా పవన్‌కల్యాణ్, దేవు మాణిక్యాలరావును మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా న్యాయవాది రవిశంకర్ పట్నాయక్, అడబాల రత్నప్రసాద్ మాట్లాడుతూ, అన్నింటికన్నా రక్త దానం గొప్పదన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు, శస్త్ర చికిత్స సమయంలోను రక్తదానం ద్వారా చాలా మంది ప్రాణాలను దాతలు కాపాడవచ్చన్నారు. 1975 అక్టోబరు ఒకటి నుంచి ఏటా జాతీయ స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవం జరుపుతున్నట్టు వివరించారు.

ఆర్డీవో కిషోర్ సేవలు అభినందనీయం



ఆర్డీవో కిషోర్‌ను అభినందిస్తున్న రమణరాజు

కాకినాడ సిటీ: కాకినాడ రెవెన్యూ డివిజనల్ అధికారిగా ఇట్ల కిషోర్ ప్రజలకు అందించిన సేవలు అభినందనీయమని కాకినాడ పౌర సంక్షేమ సంఘం పేర్కొంది. బదిలీపై వెళ్తున్న కిషోర్‌ను కాకినాడ కలెక్టర్ బంగ్లా ఆవరణలోని ఆయన నివాసంలో పౌర సంక్షేమ సంఘం ప్రతినిధులు మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా సంఘ కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ, ప్రజాహిత సమస్యల విషయంలో రాజకీయ వైషమ్యాలకు తావులేకుండా, వాస్తవ దృక్పథంతో పరిష్కార చర్యలు చూపడంలో ఇట్ల కిషోర్ ఆదర్శప్రాయంగా నిలిచారన్నారు. సిటీ వినాయక సాగర్ పునఃప్రారంభానికి, అసైన్డ్ భూముల పరిరక్షణకు, నిధుల నిర్వహణలోను గ్రీవెన్స్, పౌరసేవల్లో కాకినాడ జిల్లాకు ఖ్యాతి తెచ్చారన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంపునకు చేసిన కృషి ప్రశంసనీయమన్నారు.

శ్రీపీఠంలో భద్రత ఏర్పాట్ల పరిశీలన



శ్రీపీఠంలో భద్రతపై పరిశీలన చేస్తున్న డీఎస్పీ రఘువీర్ విష్ణు

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని శ్రీపీఠంలో గురువారం నుంచి జరగనున్న దసరా వేడుకలకు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చేందుకు అవకాశం ఉండడంతో డీఎస్పీ రఘువీర్ విష్ణు మంగళవారం బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. దసరా నవరాత్రి వేడుకల్లో భాగంగా అమ్మ కోసం లక్ష మంది పేరిట అష్టమి నాడు కుంకుమ పూజలు నిర్వహించేందుకు పరిపూర్ణానంద స్వామి పిలుపునిచ్చారు. అందుకు తగ్గట్టుగా బృందాలుగా పెద్దఎత్తున మహిళల రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టారు.

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ

కాకినాడ సిటీ: నగరంలో మంగళవారం ఉదయం నుంచి సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయా సచివాలయ సిబ్బంది చేపట్టారు. ఉదయం 5.30 నుంచి లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛను సొమ్ము అందజేశారు. కాకినాడ నగరంలో 30,106 మంది పింఛను లబ్ధిదారులు ఉండగా, వీరిలో సాయంత్రం 5.30కు 29,455 మందికి పింఛను అందజేశారు. దీంతో 97.84 శాతం పూర్తయిందని టీపీఆర్వో శైలజ తెలిపారు. మంగళవారం రాత్రి నాటికి దాదాపు నూరు శాతం పంపిణీకి చేరువవుతామని వెల్లడించారు. మొత్తం రూ.12 కోట్ల 47 లక్షల 5 వేల 500 అందజేసినట్టు తెలిపారు.

సినిమాలు



ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్:	దేవర పార్ట్-1, సత్య సుందరం, 35
దేవీ మల్టీప్లెక్సు 4 స్క్రీన్స్:	దేవర పార్ట్-1, సత్య సుందరం, 35
లక్ష్మి:	దేవర పార్ట్-1
సత్యగౌరి:	దేవర పార్ట్-1
తిరుమల:	దేవర పార్ట్-1
సీఅండ్‌సీ1:	దేవర పార్ట్-1
సీఅండ్‌సీ2:	దేవర పార్ట్-1
శ్రీప్రియ:	దేవర పార్ట్-1
పద్మప్రియ:	దేవర పార్ట్-1
సూర్య (వాకలపూడి):	దేవర పార్ట్-1
సూర్య2:	దేవర పార్ట్-1

దగ్గరైన దూర విద్య

- ఏయూ దూరవిద్యా కేంద్రం పునః ప్రారంభం
- రెండేళ్ల తర్వాత మొదలు కానున్న సేవలు
- విద్యార్థుల హర్షాతిరేకాలు
- 'సాక్షి'లో వెలువడిన కథనాలు



ఏయూ దూరవిద్యా కేంద్రం

బాలాజీచెరువు: ఏ విద్యార్హతలు లేకుండా.. 18 ఏళ్ల నిండి.. డిగ్రీ, పీజీ, డిప్లమో చేయాలనుకునే వారికి సేవలందిస్తున్న ఆంధ్రా యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రం ఎట్టకేలకు పునః ప్రారంభమైంది. వైజాగ్ ఆంధ్రా యూనివర్సిటీ దూర విద్యా కేంద్రం ఆధీనంలో పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1972లో ఏర్పాటుచేసిన ఈ కేంద్రం 2022లో మూసివేయబడింది. దీంతో అడ్మిషన్ కోసమో లేదా పరీక్షల ఫీజు దరఖాస్తు స్వీకరణ, హాల్ టికెట్ల జారీ, పరీక్షా కేంద్రం వివరాలు వంటి సమాచారం తెలుసుకోవడానికి అవకాశం లేకుండా పోయింది. ఈ విషయంపై 'సాక్షి'లో గతేడాది మార్చి 29న 'విద్యాసేవకు స్వస్తి' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై వైజాగ్ ఏయూ దూరవిద్యా కేంద్ర డైరెక్టర్ అప్పట్లో స్పందించి, ఈ విషయాన్ని ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

ఏటా 5,500 అడ్మిషన్లు

ఈ కేంద్రం ద్వారా ప్రతి ఏడాది జూన్, మే నెలల్లో జారీ చేసే నోటిఫికేషన్ ద్వారా డిగ్రీ విభాగాల్లో 4 వేల మంది, పీజీ విభాగంలో 1,500 మంది అడ్మిషన్లు పొందేవారు. వీరందరికీ సమాచారం కోసం ఈ స్టడీ సెంటర్ నెలకొల్పి, ముగ్గురు సిబ్బంది ద్వారా సేవలు అందించేవారు. వీరిని వైజాగ్ ఏయూ కేంద్రానికి అటాచ్ చేయగా, తాజాగా మళ్లీ కాకినాడ స్టడీ సెంటర్‌కు కేటాయించారు. ముఖ్యంగా తక్కువ విద్యార్హతతో ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరిన వారు ప్రమోషన్ల కోసం ఈ స్టడీ సెంటర్‌ను అత్యధికంగా ఆశ్రయించేవారు. ఈ కేంద్రం సేవలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకూ పని చేస్తుంది. ఈ కేంద్రంలో అడ్మిషన్ల వివరాలు, ఇతర విద్యా సంబంధ సమాచారం తెలియజేస్తారు.

విద్యార్థులతో కళకళ

మార్చి నెల వస్తే పరీక్షల ఫీజు చెల్లించే విద్యార్థులతో స్టడీ సెంటర్ కళకళలాడేది. తిరిగి వైజాగ్ ఏయూ నుంచి పీఆర్ కళాశాలలో ఏర్పాటుకు అనుమతి రావడంతో, ఈ కేంద్రాన్ని పూర్వ స్థానంలోనే ఏర్పాటు చేశారు. యథావిధిగా స్టడీ సెంటర్ ఏర్పాటు చేసి, సేవలు ప్రారంభించడంతో దూరవిద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అడ్మిషన్లు ప్రారంభం



స్టడీ సెంటర్‌కు సంబంధించి అన్ని సేవలు ఆన్‌లైన్‌లో ఉండటంతో, గతంలో ఈ కేంద్రాన్ని తొలగించారు. పరీక్ష ఫీజు, అడ్మిషన్ అన్నీ ఏయూ వెబ్‌సైట్‌లో ఉండటంతో పాటు, ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్లు ఏర్పాటు చేసి సమాచారాన్ని అందజేసేవారు. మళ్లీ స్టడీ సెంటర్ ఏర్పాటుకు ఉన్నత అధికారుల అనుమతి ఇవ్వడంతో, పూర్వ స్థానంలో స్టడీ సెంటర్‌ను ఏర్పాటుచేశాం. ప్రస్తుతానికి డిగ్రీ, పీజీ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నాం.

– డాక్టర్ తిరుపాణ్యం, ప్రిన్సిపాల్, పీఆర్ డిగ్రీ కళాశాల

ఎంతో ఉపయోగకరం



దూరవిద్య ద్వారా వందలాది మంది డిగ్రీ, పీజీ అభ్యసిస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా చాలా మందికి సరైన సమాచారం లభించక, అనేక ఇబ్బందులతో పాటు, చదవడానికి అంతగా ఆసక్తి చూపేవారు కాదు. మళ్లీ యథావిధిగా సేవలు ప్రారంభం కావడంతో ఇబ్బందులు తొలగుతాయి. ఈ కేంద్రం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– కె.లలిత్‌కుమార్, విద్యార్థి ప్రతినిధి

వరద బాధితుల కోసం విరాళం



కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

బోట్‌క్లబ్: వరద బాధితుల కోసం ఆంధ్రాబ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగులు సీఎం సహాయ నిధికి రూ.66,817 విరాళం అందించారు. ఈ చెక్కును కలెక్టర్ షణ్మోహన్ సగిలికి మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో సంఘ నాయకులు వీఎస్ మూర్తి అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు ప్రసాద్, జె సత్యనారాయణ, ఎస్ సత్యనారాయణ, వీవీఎస్ఎస్ మూర్తి, ఎస్‌వీవీ తాతారావు, ఆర్జి మోహనరావు పాల్గొన్నారు. అలాగే బర్రి నాగేశ్వరరావు, పాలెపు రాఘవేంద్రరావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ తరఫున రూ.10 వేల చెక్కును కలెక్టర్‌కు అందించారు.

కార్యదర్శి బాధ్యతల స్వీకరణ



కమిషనర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

కాకినాడ: కార్పొరేషన్ కార్యదర్శిగా బి.శ్రీకాంత్ రెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. హిందూపురం మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడి కార్యదర్శి ఎం.ఏసుబాబు తాడేపల్లిగూడెం కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఇలా ఉండగా కమిషనర్ భావనను శ్రీకాంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో కాకినాడ న్యాయవాదుల ప్రతిభ



బహుమతులు గెలుచుకున్న కాకినాడ న్యాయవాదులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): రాజమహేంద్రవరంలో సెప్టెంబరు 28, 29 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి న్యాయవాదుల పోటీల్లో జిల్లా క్రీడాకారులు పలు విభాగాల్లో బహుమతులు గెలుచుకున్నారని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్తింటి విశ్వేశ్వరరావు మంగళవారం తెలిపారు. పురుషుల బ్యాడ్మింటన్ డబుల్స్‌లో రన్నర్స్‌గా కేవీఎస్ఆర్ సందీప్-శివకోటి వినోద్, మహిళల డబుల్స్ క్యారమ్స్‌లో విజేతలుగా వై.వసంత-పి.శారోన్ రోజా, చెస్, క్యారమ్స్ మహిళల సింగిల్స్ రన్నర్‌గా వై.వసంత నిలిచారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం కాకినాడ బార్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విజేతలను అధ్యక్షుడు విశ్వేశ్వరరావు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు నరహరశెట్టి కృష్ణ, జనరల్ సెక్రటరీ చెక్క శ్రీనివాసరావు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల కార్యదర్శి దొంతుమల్ల అశోక్‌కుమార్ తదితరులు అభినందించారు.

సంఘ సంస్కర్త రఘుపతి వెంకటరత్నం నాయుడు

బోట్‌క్లబ్: మహిళా విద్యావ్యాప్తికి రఘుపతి వెంకటరత్నం నాయుడు ఎనలేని కృషి చేశారని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యదర్శి చిట్ల కిరణ్ అన్నారు. రఘుపతి వెంకటరత్నం నాయుడు జయంతి సందర్భంగా స్థానిక రంగరాయ మెడికల్ కళాశాల్లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ, మహిళా విద్యా వ్యాప్తికి నాయుడు ఎనలేని కృషి చేశారన్నారు. పీఆర్ కళాశాలలో మహిళలకు ప్రవేశం కల్పించడమే కాక, వెనుకబడిన వర్గాలు, పేద విద్యార్థులకు వసతి, భోజన వసతి కల్పించారన్నారు. బ్రహ్మ సమాజంలో ముఖ్యమైన కుల వ్యవస్థ నిర్మూలనకు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు దొరబాబు, వీరభద్రరావు, చలం, శ్రీమన్నారాయణ, ఆదిత్య పాల్గొన్నారు.

రూ.55 వేల విలువైన బాణసంచా సీజ్



పోలీసులు సీజ్ చేసిన బాణసంచా

కాకినాడ రూరల్: ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని చీడిగ గ్రామంలో అనధికారికంగా నిల్వ ఉంచిన బాణసంచాను పోలీసులు సీజ్ చేశారు. వాసంశెట్టి వీరబాబు అనే వ్యక్తి రేకుల షెడ్‌లో అనుమతి లేకుండా సుమారు రూ.55 వేల విలువైన బాణసంచాను నిల్వ చేసినట్టు పోలీసులు గుర్తించారు. బాణసంచాను పోలీసులు సీజ్ చేసి, వీరబాబుపై కేసు నమోదు చేశారు.

3 నుంచి శరన్నవరాత్ర ఉత్సవాలు



వివరాలు చెబుతున్న అచ్యుత రామారావు

బోట్‌క్లబ్: శరన్నవ రాత్ర ఉత్సవాలు స్థానిక అశోక్‌నగర్ షిరిడీ సాయిబాబా ఆలయంలో ఈ నెల 3 నుంచి 13 వరకూ ఘనంగా జరుగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ వేదుల అచ్యుతరామారావు తెలిపారు. ఆలయంలో మంగళవారం ఆయన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ప్రతి రోజు అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిస్తారన్నారు. ఈ నెల 3న లలితాదేవి, 4న బాలాత్రిపుర సుందరి, 5న గాయత్రీదేవి, 6న అన్నపూర్ణాదేవి, 7న శాకాంబరి, 8న మహాలక్ష్మీదేవి , 9న సరస్వతీదేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసుర మర్దిని, 12న రాజరాజేశ్వరిదేవి అలంకరణల్లో అమ్మవారు దర్శనమిస్తారని వివరించారు. ఈ నెల 6న విద్యార్థులు, బాలలతో సామూహిక సరస్వతీ పూజ జరుగుతుందన్నారు. 12న సర్వ దేవతా హోమం, పూర్ణాహుతి, శమీపూజ, మహాబలిహరణ జరుగుతుందని చెప్పారు. ఈ నెల 13న సాయిబాబావారి మహాసమాధి ఉత్సవాల సందర్భంగా సాయి సత్య వ్రతాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం అన్న సమారాధన జరుగుతుందన్నారు. భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

అమ్మవారి విగ్రహాలు సిద్ధం!





సిద్ధమైన అమ్మ వార్ల విగ్రహాలు. (అంతర చిత్రం) సర్పవరం వద్ద విక్రయానికి సిద్ధం చేసిన కనకదుర్గ విగ్రహం

కాకినాడ రూరల్: దసరా వేడుకల్లో భాగంగా మంటపాల్లో కొలువయ్యేందుకు అమ్మవారి విగ్రహాలు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. సర్పవరం వద్ద గుజరాత్, రాజస్థాన్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు కనకదుర్గ అమ్మవారి విగ్రహాలను పెద్దఎత్తున తయారు చేశారు.

ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో గాంధీ జయంతి



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

కాకినాడ రూరల్: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ కోర్స్ కో-ఆర్డినేటర్ కొమ్మర జోసెఫ్ స్టీఫెన్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా పాల్గొన్న కాకినాడ గాంధీ భవన్ కార్యదర్శి వక్కలంక రామకృష్ణ అతిథి ఉపన్యాసాన్ని అందించారు. కార్యక్రమానికి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.పోచయ్య అధ్యక్షత వహించారు. ముందుగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, గాంధీజీ స్వాతంత్ర్యోద్యమంలో చేసిన పలు ఉద్యమాలు, పోరాటాలు భారతజాతిని ఏకం చేసి ఉద్యమం వైపు నడిపించడంలో చేసిన కృషిని వివరించారు. కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో గాంధీజీ చేసిన పర్యటనలు, ఆయన ద్వారా స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని పొందిన మహనీయుల జీవితాలను విశదీకరించారు. స్వాతంత్ర్య ఫలాలు పరిపూర్ణంగా ఫలించాలంటే గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఉద్బోధించారు. విభాగ సహాయాచార్యులు డాక్టర్ ఎం.నానిబాబు, డాక్టర్ కె.హరిబాబు, డాక్టర్ ఎం.గోపి, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విభాగం తరఫున రామకృష్ణను శాలువాతో సత్కరించారు.

గ్రామాభివృద్ధికి ముందుంటాం

- తీర్మానాలివ్వలేదని ఎమ్మెల్యే అనడం అవాస్తవం
- తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ సత్యనారాయణ

కాకినాడ రూరల్: గ్రామాభివృద్ధికి ముందు వరసలో ఉంటానని, తీర్మానాలు ఇవ్వడం లేదని రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అనడం వాస్తవం కాదని తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ అన్నారు. కావాలనే ఆయనకు కొందరు తప్పుడు సమాచారం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తిమ్మాపురం గ్రామ పంచాయతీలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తాను 2002 నుంచి సర్పంచ్, ఉప సర్పంచ్‌గా పనిచేశానన్నారు. 2021 పంచాయతీ ఎన్నికల్లో మరోసారి సర్పంచ్‌గా ఎన్నికయ్యానన్నారు. 22 ఏళ్లుగా తిమ్మాపురం గ్రామ అభివృద్ధికి కోట్లాది రూపాయలతో పనులు చేశామన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, పాఠశాలలు, సామాజిక భవనాల నిర్మాణాలకు కృషి చేశాన్నారు. శనివారం కాకినాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన హౌసింగ్ సమావేశంలో ఎమ్మెల్యే పంతం నానాజీ తిమ్మాపురం సర్పంచ్ తీర్మానాలు ఇవ్వడం లేదని, అందువలన అక్కడ అభివృద్ధి చేయలేకపోతున్నట్టు చెప్పడాన్ని మీడియా ద్వారా తన దృష్టికి వచ్చిందన్నారు. గ్రామాభివృద్ధి కోసం తాను ఎప్పుడు రాజకీయాలు చేయలేదని, తీర్మానాలు చేయలేదనడం సరికాదన్నారు. ఎమ్మెల్యేగా నానాజీ గెలిపొందాక, గ్రామంలో అభివృద్ధి పనులకు తీర్మానాలు కావాలంటే చేశామన్నారు. ఎస్సీ పేటలో రూ.5 లక్షలకు, ఏడీబీ రోడ్డు నుంచి మొత్తం మూడు రోడ్లకు రూ.88.50 లక్షలకు తీర్మానాలు చేశామన్నారు. ఏఈ వాసుదేవరావు అవంతినగర్‌లో ఎనిమిది నెలల క్రితం చేసిన రూ.10 లక్షల వర్కుకు తీర్మానం అడుగుతున్నారని, ఆ వర్కు ఎవరు చేశారో తమకు తెలియదన్నారు. గ్రామాభివృద్ధి ఆటంకం కలిగించే దానికి తాము సిద్ధంగా లేమన్నారు. వాసుదేవరావు అనే ఆయన ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కు ఫోన్ చేసి, జనసేన నాయకులు చెప్పిన పనులు చేయండని, వారు చెప్పిన వర్కులకు ఎస్టిమేషన్ వేయమని చెబుతున్నారని చెప్పారు. వీటికి తీర్మానం చేయడానికి సర్పంచ్ కావాలా అని ప్రశ్నించారు. సర్పంచ్‌లకు అధికారాలు ఇస్తామని డిప్యూటీ సీఎం చెబుతున్నారని, ప్రోటోకాల్‌ను కూడా అధికారులు పాటించడం లేదన్నారు. గ్రామానికి ఎన్ని నిధులు తీసుకువచ్చినా ఎమ్మెల్యేకు సహకరిస్తామని, తీర్మానాలు చేస్తామన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు



నవోదయ బుక్‌లెట్‌లతో విద్యార్థులు

కాకినాడ రూరల్: కరప మండలం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నవోదయ ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కరప మండల విద్యా శాఖ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖాధికారి కేబీ కృష్ణవేణి, పి.సత్యనారాయణ, మండలానికి చెందిన ఉపాధ్యాయులతో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నవోదయ ఫ్యాకల్టీగా పి.ఇందిరాగాంధీ విద్యార్థులకు నవోదయ పరీక్షకు ఎలా సిద్ధం కావాలనే అంశంపై వివరించారు. యంగ్ మిడ్డే చెర్రి సంస్థ ప్రతినిధి వాకాడ చిన్న విద్యార్థులందరికీ నవోదయ మోడల్ బుక్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీగా ఎస్.విఘ్నేశ్వరరావు, వీఎస్ఎన్ రామారావు, బొజ్జ మంగారావు, పీవీ రమణమూర్తి, పి.నాగేశ్వరరావు, జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఎంఈవో మాట్లాడుతూ ఇటువంటి అవగాహన సదస్సులతో విద్యార్థులకు ఎంతో ఉపయోగమన్నారు. కార్యక్రమంలో 140 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటలు ఆడేదెలా..!?









నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): అధికారుల నిర్లక్ష్యం కాస్తా ప్రజలకు కష్టాలను తెచ్చిపెడుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు స్థానిక సురేష్ నగర్‌లోని పార్కులో పిల్లల ఆట స్థలం నిండా నీట మునిగింది. పిల్లలు ఆడుకునేందుకు వీల్లేకుండా పోయింది. పిల్లల ఆట స్థలాల్లో వర్షపు నీరు నిలిచిపోకుండా కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని సురేష్‌నగర్ కాలనీ వాసులు కోరుతున్నారు.